క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కావడి ఉత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల్లో భాగంగా గురువారం భక్తిశ్రద్ధలతో కావడి ఉత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు కావడి ఉత్సవంలో పాల్గొన్నారు. కావడి చేతబూని ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.

ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజల కుటుంబాలపై భారంగా మారిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఎత్తి వేయడంతో పాటు ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక 63వ డివిజన్ సుందరయ్య నగర్ వద్ద గురువారం కొవ్వొత్తులతో నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు మాట్లాడుతూ.. ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేసేంత వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు, నగర కమిటీ సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, పి.సాంబిరెడ్డి, ఎల్.నిర్మల, పి.జగన్, భవాని, పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయ్ మర్చంట్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు

విజయవాడస్పోర్ట్స్: బీసీసీఐ దేశవాళీ టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీ గ్రూప్ – డి క్రికెట్ మ్యాచ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్‌బాబు వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ మ్యాచ్‌ల కోసం మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియం, మూలపాడులోని డీవీఆర్, సీపీ మైదానాలను సిద్ధం చేశామన్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్ణాటక–విదర్భ, రాజస్థాన్–ఝార్ఖండ్, అస్సాం–ఉత్తరాఖండ్, 11 నుంచి 13 వరకు రాజస్థాన్–ఉత్తరాఖండ్, ఝార్ఖండ్–కర్ణాటక, జమ్మూ కశ్మీర్–విదర్భ, 17 నుంచి 19 వరకు రాజస్థాన్–విదర్భ, జమ్మూ కశ్మీర్–కర్ణాటక, ఝార్ఖండ్–ఉత్తరాఖండ్, 22 నుంచి 24 వరకు కర్ణాటక–ఉత్తరాఖండ్, రాజస్థాన్–జమ్మూ కశ్మీర్, ఝార్ఖండ్–విదర్భ, 28 నుంచి 30 వరకు జమ్మూ కశ్మీర్–ఝార్ఖండ్, ఉత్తరాఖండ్–విదర్భ, రాజస్థాన్–కర్ణాటక జట్లు తలపడతాయన్నారు.

వీఎంసీ కార్మికులకు వైద్య పరీక్షలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలో ఆయా విభాగాల్లో విధులు నిర్వహించే కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు తాము నిరంతరం శ్రమిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు తెలిపారు. యూనియన్, ఈఎస్ఐ సంయుక్త ఆధ్వర్యంలో వీఎంసీలోని ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, ఉద్యాన వన విభాగంలో విధులు నిర్వహించే కార్మికులకు ఆయన నగరంలోని రాజీవ్‌నగర్‌లోని ఓల్డేజ్ హోమ్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. కార్మికులకు కళ్లు, బీపీ, షుగర్, శ్వాస, గుండె, కిడ్నీ, లివర్ తదితర ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నాయకులు సాంబశివరావు, సూర్యనారాయణ, విజయ్‌కుమార్, కల్యాణ్ పాల్గొన్నారు.

నేడు అదితీ ప్రహ్లాద్ గాత్ర సంగీత కచేరీ

విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే, కేవీ బ్రహ్మానందం కళావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అంతర్జాతీయ సంగీత విద్వాంసులు అదితీ ప్రహ్లాద్ గాత్ర కచేరీని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు కేవీ బ్రహ్మానందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మృదంగ విద్వాంసురాలు డాక్టర్ మండపాక నాగలక్ష్మిని సత్కరిస్తామన్నారు.

రూ.14 లక్షలతో పైపులైన్ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్‌లో ధ్వంసమైన పాత వాటర్ పైపులైన్ల స్థానంలో రూ.14 లక్షలతో కొత్త పైపులైన్ పనులను గురువారం కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత కాలంనాటి పైపులైన్లు పాడవ్వటంతో సమస్యను ఎమ్మెల్యే బోండా ఉమా దృష్టికి తీసుకువెళ్లగా కొత్త పైపులైన్ల కోసం రూ.14 లక్షలు మంజూరు చేశారన్నారు. శాంతినగర్ చర్చి నుంచి రామలింగేశ్వరపేట పింగళి వారి వీధి వరకు కొత్త పైపులైను వేస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

గుణదల ఆర్వోబీ కల సాకారమయ్యేనా?

- ఫ్లై ఓవర్ నిర్మాణం అనివార్యం
- 15 ఏళ్లుగా మరుగున పడిన వైనం
- ప్రయాణికుల ఎదురు చూపు

గుణదల(విజయవాడతూర్పు): నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే గుణదల వంతెన సెంటర్ ప్రాంతంలో ఆర్వోబీ నిర్మాణం కలగానే మిగిలిపోయింది. ప్రయాణికులు సజావుగా రాకపోకలు సాగించేందుకు ఈ ప్రాంతంలో ఆర్వోబీ ఫ్లై ఓవర్ నిర్మాణం అనివార్యం. ఈ నిర్మాణం శంకుస్థాపన స్థాయిలోనే నిలిచిపోయింది. ప్రభుత్వాలు, అధికారులు మారినా ఫ్లై ఓవర్ నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చటం లేదు.

2009లో శంకుస్థాపన..

గుణదల సెంటర్ నుంచి కాల్వలు, రైల్వే ట్రాక్ దాటి కార్మెల్ నగర్ (నున్న రోడ్డు) వైపు వెళ్లే విధంగా ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించాలని 2009వ సంవత్సరంలో ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు 19–02–2009 తేదీన స్థానిక ఏలూరు కాల్వ సమీపంలో అప్పటి రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు, కంకిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే దేవినేని రాజశేఖర్(నెహ్రూ) తదితరులు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఇప్పటికీ పూర్తికాని వైనం..

ఫ్లై ఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. కానీ ఆర్వోబీ నిర్మాణం మాత్రం కలగానే మిగిలిపోయింది. శంకుస్థాపన చేసిన రోజుల్లో హడావుడిగా సర్వే చేసి, ప్లాన్ రూపొందించి పిల్లర్లు నిర్మించారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాక ఫ్లై ఓవర్ పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా స్థానికంగా ఉండే కాల్వగట్టు వాసులను సుమారు 80 కుటుంబాల పేదలను ఇక్కడి నుంచి తరలించి స్థల సేకరణ చేశారు. సర్వీసు రోడ్డులకు అవసరమైన భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఆర్‌అండ్‌బీ, రైల్వే, కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో పనిచేసి ఈ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ముందుకు వచ్చారు. కానీ ఫ్లై ఓవర్ నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ఇప్పటికీ సుమారు 80 కోట్ల రూపాయల నిధులు సిద్ధంగా ఉన్నా ఈ నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గుణదల ఆర్వోబీ నిర్మాణం పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు



రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు

వెంటనే ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించాలి..

కాల్వగట్టు వాసులు, 1వ డివిజన్ ప్రజలు రాకపోకలు సాగించాలంటే గుణదల రైల్వే గేటు దాటుకుని ఏలూరు రోడ్డుకు వెళ్లాలి. రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేయటం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గంటల కొద్దీ వాహనాలు కదలలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగితే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు, నాయకులు స్పందించి వెంటనే ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించాలి.

– సి.మురళీధర్, గుణదల



ఫ్లై ఓవర్ నిర్మాణానికి 2009లో ఏర్పాటు చేసిన శిలాఫలకం(ఫైల్)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ నల్లగేటు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడింకి వారి స్ట్రీట్, రామాలయం వీధి, గడియారం వారి వీధి, అబ్బూరు వారి వీధి, వ్యాకరణం వారి వీధి, ముదిగొండ వారి వీధి, తిరుమల శెట్టి వారి వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

రహదారికి మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 28వ డివిజన్ భానునగర్, 31వ డివిజన్‌ముత్యాలంపాడులో రహదారి మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి. రోడ్డుపై పడిన గుంతలను సరిచేశారు. అలాగే రద్దీ కూడలి ప్రాంతాలలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వలంటీర్ల దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నెహ్రూ యువజన కేంద్రం, జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వలంటీర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వలంటీర్ల సమావేశంలో జిల్లా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడారు. 'నేను కాదు నువ్వు' అనే జాతీయ సేవా నినాదంతో వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ కంటే ఇతరుల సేవలో తరిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని వలంటీర్లు సాధారణ ఎన్నికల్లో 1,050 మంది, బుడమేరు వరద సహాయక చర్యల్లో 650 మంది 13 రోజులు పాటు అవిశ్రాంతంగా సేవలు అందించారని చెప్పారు. అలాగే 650 మంది వలంటీర్లు దసరా ఉత్సవాల్లో సేవలందించారన్నారు. వలంటీర్లను అభినందించి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. వలంటీర్ల సేవలు ఉపయోగించుకుంటున్నారు గాని వారిని ప్రోత్సహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు అయినప్పటికీ వలంటీర్లు ఎప్పుడూ సేవలో ముందుండటం వారి సేవాగుణానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, సంస్కృత శాఖ విభాగాధిపతి డాక్టర్ రామ్మూర్తి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న వలంటీర్లతో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రమేష్ తదితరులు

స్వచ్ఛతకు సాంకేతికత అవసరం

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛతకు సాంకేతికతతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల వినియోగంతో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేలా వీఎంసీ చర్యలు తీసుకోవాలని స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ సూచించారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తో గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో స్వచ్ఛ విజయవాడపై సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు.

పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి వ్యర్థ నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డ్రోన్ల నిర్వహణను సమన్వయం పరుస్తూ డ్రోన్ సర్వేలైన్స్ ద్వారా ప్రస్తుతం ఉన్న సమస్యలను ఎలా తీర్చవచ్చు ఎలా తీర్చగలము లాంటి అంశాలపై చర్చించారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర నగరంలోని ఆయా డివిజన్లలోని గృహాలు, వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్న పలు సమస్యలను వివరించారు. దోమలు పెరగకుండా ఉండేందుకు, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించేందుకు, కుక్కలు, ఆవుల వివరాలు సేకరించేందుకు ఇతర అంశాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ సర్వే లైన్స్ వినియోగించాలన్నారు. సమావేశంలో స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ అధికారులు భాగ్యలక్ష్మి, దశరథ్ రామి రెడ్డి, స్వచ్ఛ ఆంధ్రా చీఫ్ ఇంజినీర్ శ్రీరామచంద్ర, వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇన్‌చార్జి(వెహికల్స్) ఏసుపాదం, బయాలజిస్ట్ సూర్య కుమార్, డ్రోన్ టీమ్ సభ్యులు, నియో స్కై నిపుణులు శరత్చంద్ర, హను, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, పట్టాభిరామ్, అనిల్‌కుమార్‌రెడ్డి

డ్రోన్లతో నేరస్తులపై నిరంతరం నిఘా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి రైల్వేస్టేషన పరిసర ప్రాంతాలలో డ్రోన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ వై.బాలరాజాజీ, నున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్‌లతో రెండు బృందాలను ఏర్పాటు చేసి వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. క్లాక్ టవర్ వద్ద ఫాల్కాన్ వాహనం నుంచి ఏసీపీ డ్రోన్ విజువల్స్‌ను పర్యవేక్షిస్తూ అనుమానితుల వివరాలను సిబ్బందికి అందసి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బొగ్గు లైన్ క్వార్టర్స్ వద్ద ముగ్గురు, మట్టిరోడ్డులో మరో ముగ్గురు బహిరంగంగా మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ స్రవంతిరాయ్ మాట్లాడుతూ నార్త్ డివిజన్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రతి రోజు డ్రోన్లతో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. బహిరంగ మద్యం సేవించేవారు, గంజాయి, మత్తు పదార్థాలను ఉపయోగించే వారితో పాటు శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తున్న వారిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌పురం, నున్న ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్ విజువల్స్ పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్

సుస్వరాల సంగమం చిత్ర గీతాల గానం

విజయవాడకల్చరల్: రాగలహరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం నిర్వహించిన చిత్ర గీతాల కార్యక్రమం మధురంగా సాగింది. గాయని మల్లాది స్వాతి పర్యవేక్షణలో, వడ్డాది సూర్య కామేశ్వరి, పరమేశ్వరి, షబానా, అయ్యప్పన్ సాయి కృష్ణ, డి.మోహన రాజు, రామాంజీ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి ఏపీఎల్ఏ అథారిటీ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో విజయాలు సాధించాలని సూచించారు. విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. సంస్థ వ్యవస్థాపక సభ్యుడు మీరాకుమార్, విశ్రాంత ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్ఏవీ ప్రసాదరావు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎల్ఎస్ఎం రమాశ్రీ చేతులమీదుగా సంస్థ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీరాకుమార్, చింతకాయల చిట్టిబాబు, బి.వీరభద్రరావు, ముష్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



12న హుండీ కానుకల లెక్కింపు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు ఈనెల 12వ తేదీన జరుగుతుందని ఆలయ ఈఓ వై.సీతారామయ్య గురువారం తెలిపారు. 12వ తేదీ ఉదయం 10 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖాధికారులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, రెవెన్యూ, పోలీసు, హిందూ సేవా దళ్ సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీలను లెక్కిస్తామన్నారు.

నిజాయతీ చాటుకున్న సినిమా హాల్ సిబ్బంది



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సినిమా హాల్లో దొరికిన సెల్‌ఫోన్‌ను తిరిగి బాధితులకు అప్పగించి సినిమా థియేటర్ సిబ్బంది తమ నిజాయతీని చాటుకున్నారు. సింగ్‌నగర్ పైపులరోడ్డు జంక్షన్‌లో ఉన్న 'తార స్క్రీన్స్'కి 'పుష్ప.2' సినిమాను వీక్షించేందుకు నున్న ప్రాంతానికి చెందిన బాయన దుర్గాదేవి గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. సినిమా చూస్తుండగా కుమార్తె సెల్‌తో ఆడుతూ సీట్‌లో మర్చిపోయి వెళ్లారు. సినిమా వదిలాక సిబ్బంది థియేటర్ క్లీన్ చేస్తుండగా, సీట్‌లో పడి ఉన్న సెల్‌ఫోన్‌ను గుర్తించారు. సెక్యూరిటీ గార్డ్ వీరలంకయ్య ఫోన్‌ను మేనేజర్‌కు అప్పగించారు. ఆయన సెల్‌లో నంబర్ల ఆధారంగా దుర్గాదేవికి కాల్ చేసి, ఫోన్ అందజేశారు. దీంతో థియేటర్ సిబ్బంది, యాజమాన్యానికి దుర్గాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

పారుపల్లి జయంతి ఉత్సవాలు ప్రారంభం

విజయవాడకల్చరల్: సద్గురువుల సేవలు సదా స్మరణీయమని సంగీత విద్వాంసుడు టీఎస్ రామచంద్రరావు అన్నారు. గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి సందర్భంగా నాలుగు రోజులపాటు నిర్వహించే సంగీత ఉత్సవాలు శివరామ కృష్ణయ్య క్షేత్రంలో గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమంలో కె.సుధీర్ శర్మకు సునాద సుధానిధి పురస్కారం, గాత్ర కచేరి నిర్వహించారు. సభను ప్రారంభించిన రామచంద్రరావు మాట్లాడుతూ.. పారుపల్లి రామకృష్ణయ్య పంతులు త్యాగరాజ స్వామి పరంపరకు చెందిన వారన్నారు. వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ.. పారుపల్లి ఎందరో విద్వాంసులకు సంగీత జ్ఞాన భిక్షను అనుగ్రహించారని తెలిపారు. సంగీత విద్వాంసుని జీవిత విశేషాలను స్వరఝరి కార్యదర్శి వివరించారు. సుధీర్ శర్మ నిర్వహించిన గాత్ర సంగీత కచేరి ఆకట్టుకుంది. వయోలిన్‌పై ఎం.విజయ్, మృదంగంపై రాఘవన్, ఘటంపై షామిత్ ఎస్.గౌడ సహకరించారు.

బడి పండుగతో విద్యార్థులకు జరిగే మేలేమిటి?

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7న నిర్వహించనున్న బడి పండుగతో జరిగే ప్రయోజనాలేమిటో తల్లిదండ్రులకు ప్రభుత్వం వివరించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే తల్లిదండ్రుల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని.. ఇప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాలు ఎవరిని మోసం చేయటానికని సూటిగా ప్రశ్నించారు. నూతన విద్యా విధానం కోసం గత ప్రభుత్వం అక్షరాల రూ.71 వేల కోట్లు ఖర్చు చేయగా.. ఈ ప్రభుత్వం ఇంతవరకు ఎంత కేటాయించిందో సమాధానం చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యపై ప్రజలలో నమ్మకాన్ని పెంచారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అగచాట్లు పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా ఆలోచన చేయాలని.. రద్దు చేసిన కార్యక్రమాలను వెంటనే పునరుద్ధరించాలని విష్ణు డిమాండ్ చేశారు.

స్పెషల్ పోలీసులకు తిరిగి ఉద్యోగాలు కల్పించాలి

ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్ సివిలియన్ అసోసియేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్ సివిలియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.చిట్టిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ సివిలియన్ పేరుతో 2,156 మందిని నియమించిందన్నారు. పోలీసు విధులు నిర్వర్తించామని చెప్పారు. బోర్డర్ చెక్ పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తూ మద్యం, ఇసుక, గంజాయి అక్రమ రవాణా పట్టుకుంటూ ఎస్ఈబీ డిపార్టుమెంట్‌కు అనుబంధంగా పనిచేశామన్నారు. ఆ తర్వాత కాలంలో విధుల నుంచి తొలగించారని చెప్పారు. ఎన్నికల ముందు చంద్రబాబు తాము అధికారంలోకి తిరిగి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఆర్నెలు పూర్తి కావస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశామని చెప్పారు. డీజీపీకి లెటర్ పంపిస్తామని చెప్పారని, కానీ డీజీపీని కలిస్తే ఆ విషయం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఈగల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లో అవకాశం కల్పించాలన్నారు. ఉద్యోగాలు ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మచందు, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీప్రశాంత్, విల్స్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు తదితరులు

ఎట్టకేలకు రాకపోకల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ రామకృష్ణాపురం రోడ్డులో రాకపోకలను నగరపాలకసంస్థ అధికారులు పునరుద్ధరించారు. ఇక్కడ యూజీడీ పైపులైన్ పనులలో భాగంగా రెండు వారాలుగా రాకపోకలు నిలిపివేశారు. దీంతో రాకపోకలకు వాహనచోదకులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో గురువారం నత్తనడకన యూజీడీ పైపులైన్ పనులు శీర్షికన కథనం ప్రచురించితమైంది. దీనికి స్పందించిన నగరపాలకసంస్థ యూజీడీ అధికారులు పనులు వేగవంతం చేయటంతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. అధికారులు స్పందించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

బీఆర్టీఎస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరపాలకసంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. బీఆర్టీఎస్ రోడ్డులో ఆక్రమణలను తొలగించారు. బీఆర్టీఎస్ రోడ్డులో నూతనంగా పచ్చబడ్డీలు వెలిశాయి. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలపై సాక్షి దినపత్రికలో బుధవారం 'పచ్చబడ్డీలు వెలిశాయ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులు ఆక్రమణలను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఒంటరితనంతో వృద్ధుడి ఆత్మహత్య

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఒంటరితనంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరసవల్లి మురళీమోహన్ రైల్వేలో పనిచేసి పదవీ విరమణ పొంది పూర్ణానందంపేటలోని అతని బావ మరిది ఇంట్లో నివాసముంటున్నాడు. అతనికి భార్య, కొడుకు, కూతురు మానస సంతానం. ఆరేళ్ల క్రితం కుమారుడు మరణించగా, తొమ్మిది నెలల క్రితం భార్య కూడా చనిపోయింది. మానస వివాహం జరిగి హైదరాబాద్‌లో ఉండటంతో బావ మరిది తేజశ్వరరావు ఇంట్లోనే ఉంటున్నాడు. తరచూ మానస తండ్రికి ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకుంటోంది. ఈ క్రమంలోనే ఇటీవల ఫోన్ చేసినప్పుడల్లా ఒంటరితనం భరించలేకపోతున్నానంటూ బాధపడుతుండేవాడు. బుధవారం ఉదయం ఆమె తండ్రికి ఫోన్‌చేసి మాట్లాడింది. సాయంత్రం తిరిగి ఫోన్ చేయగా ఎంతకు లిఫ్ట్ చేయకపోవడంతో తండ్రితో కలిసి ఉంటున్న బాబాయ్‌కి ఫోన్ చేసి చూడమని చెప్పడంతో అతను వెళ్లి తలుపులు తెరచి చూడగా ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.